# సర్వరోగ నివారిణి

**అ**తణ్ని అపరధన్వంతరి అన్నారు. అతను సర్వరోగనివారిణి కనిపెట్టి, దానితో అన్ని రోగాలూ నయం చేస్తూ, ఇతర వైద్యులనోట మట్టిగొట్టటమే గాక, బాగా డబ్బుకూడా సంపాదించాడు.

సర్వరోగ నివారిణి తయారు చెయ్యడానికి కావలసినది నాలుగే నాలుగు దినుసులు. అందులో రెండు మూలికలు. ఔషధ రహస్యం మరొకడికి తెలియటం ఇష్టంలేక అతను తానే శ్రమపడి ఓషధులను రహస్యంగా ఏరి తెచ్చి మందు రహస్యంగా తయారు చేసేవాడు. ఇది శ్రమతో కూడిన పని.

పేదవాడుగా ఉన్నప్పుడు ఉత్సాహంగా శ్రమపడినవాడు, దబ్బు పోగవుతున్న కొద్దీ శ్రమ అంటే విముఖత తెచ్చుకున్నాడు. మరి ఏం చెయ్యాలి? సర్వరోగ నివారిణి ధర పెంచాడు. సగం మందు అమ్మినా పాత రాబడికన్నా ఎక్కువ వస్తున్నది. కాని సగం శ్రమపడక తప్పటం లేదు.

ఏం చెయ్యాలి తన మందును తనే కల్తీచేసి, ఓషధులకు బదులు ఇంకేవో తేలిగ్గా దొరికే ఆకులు వాడాడు. సర్వరోగ నివారిణి రాను రాను జలుబు కూడా నయం చెయ్యలేని పరిస్థితికి వచ్చింది.

దానికి గిరాకీ తగ్గింది. అతడికి రాబడి తగ్గింది. పాత సంపాదన మీద బతికినన్నాళ్లూ దర్జాగా బతికి, చిల్లిగవ్వ మిగల్చకుండా చచ్చాడు.

సర్వరోగ నివారిణి ఎలా తయారు చేయాలో ఎవరికీ తెలేదు. అదే అతను మానవజాతికి చేసిన ద్రోహం.

***ముద్రణ : యువ, ఫిబ్రవరి 1977***